'శుష్క ప్రియాలు, శూన్య హస్తాలు. భగ్రాజమానం భజగోవిందం' ఈ మాటలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తరచూ వాడుతుండేవారు. దానర్థం 'అన్నీ ఉత్తమాటలే, ఉత్తముచ్చట్లేనని'. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, దాని తీరుతెన్నులు నిశితంగా పరిశీలిస్తుంటే ప్రస్తుతం ఈ పదాలు వాడకుండా ఉండలేకపోతున్నామంటే అతిశయోక్తి కాదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేండ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను మించి ఉండాలన్న ఉత్సాహంతో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాల తాయిలాలతో ఓటర్లను ఆకర్షించాలని ఎత్తుగడ వేసింది. ఆ మేరకు సఫలీకృతమైంది. వందల హామీలిచ్చినప్పటికీ, 1.81 శాతం ఓట్ల మెజారిటీతో మాత్రమే అధికారాన్ని సొంతం చేసుకున్నది. అదేం పెద్ద విజయం కాదన్నది రాజకీయం తెలిసిన వాళ్లు చెబుతున్న మాట. ఇక చాలామంది సోకాల్డ్ రాజకీయ విశ్లేషకులు కూడా 'మొన్నవచ్చింది కాంగ్రెస్ హవా' అంటూ వ్యాఖ్యానించడం ఆశ్చర్యకరం. హవా వస్తే రాష్ట్రమంతా రావాలి కానీ, పట్టణ ప్రాంతంలో అసలు ఏమాత్రం ప్రభావం చూపకపోవడం ఏంటి? గ్రామీణ ప్రాంతాల్లోనే కాంగ్రెస్ గెలవడం, అది కూడా కొన్ని ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలోనే అన్నది గుర్తెరగాలి.

# శుష్క ప్రియాలు, శూన్య హస్తాలు!



**డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి**

పాలసీ పాలసీ సంబంధిత అంశాలపై ఒక్కసారి చర్చిద్దాం. చాలామంది కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు మాత్రమే ఇచ్చిందని అంటున్నారు. కానీ, ఆ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో సుమారు 400కి పైగా హామీలు ఉన్నాయి. వాటిని ఎలా అమలు చేస్తుందో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. ఆ 42 పేజీల మ్యానిఫెస్టో పత్రంలో 37 భాగాలున్నాయి. అవిగాక, సుపరిపాలన, 6 గ్యారంటీల కార్డు, 5 డిక్లరేషన్లు, అనుబంధ మ్యానిఫెస్టో పేరుతో జాబ్ క్యాలెండర్లున్నాయి. వీటిలో గ్యారంటీల కార్డు గురించి వారు అన్నింటికన్నా ఎక్కువగా ప్రచారం చేశారు. దాని అమలుకు 100 రోజుల గడువును వారే కోరారు. అదిగాక, జాబ్ క్యాలెండర్‌లో ఆయా ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిర్దిష్టమైన తేదీలు ఇచ్చినందున అవి కూడా గడువుల వంటివే. అంతేకాదు, అధికారానికి వచ్చిన తర్వాత తొలి మంత్రివర్గ సమావేశంలోనే 6 గ్యారెంటీలకు చట్టబద్ధత, మెగా డీఎస్సీ ప్రకటన, 9వ తేదీన రూ.2 లక్షల రుణమాఫీ వంటి ఇతర నిర్దిష్టమైన హామీలున్నాయి. గడువు అయితే 100 రోజులు ఉన్నప్పటికీ, యాసంగి పంటల సాగు మొదలైనందున అందుకోసం రైతు భరోసా కింద రైతులకు ఎకరానికి ఈ విడతగా రూ.7,500, కౌలుదార్లకు రూ.7,500 చొప్పున పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాల్సి ఉన్నది.

ఆరు గ్యారెంటీలను పరిశీలిస్తే.. అందులో మొదటిది మహాలక్ష్మి. ఈ హామీలో భాగంగా మహిళలకు ప్రతి నెల రూ.2500 ఆర్థిక సాయం, బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్‌లను ఇస్తామని ప్రకటించారు. రెండోది రైతు భరోసా. దీని కింద రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15,000, కౌలు రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15,000, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000 ఆర్థిక సాయంతో పాటు వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారు. మూడోదైన గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తామని ప్రకటించారు. నాలుగోది ఇందిరమ్మ ఇండ్లు. ఇల్లులేని వారికి ఇంటి స్థలం, రూ.5 లక్షలు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం దీని కింద ఇస్తామన్నారు. ఐదోది యువ వికాసం. అందులో భాగంగా విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, అదిగాక, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూళ్లు అందుబాటులోకి తెస్తామన్నారు. ఆఖరి గ్యారెంటీ చేయూత. దీనిలో భాగంగా నెలవారీ పింఛన్లు రూ.4,000, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం. వీటన్నింటి అమలుకు గడువు 100 రోజులు. అంతేగాక ఈ గ్యారెంటీ కార్డుకు చట్టబద్ధత కల్పించటం. ఈ హామీల్లో ఏది అమలు కాకపోయినా ఆ పార్టీ నేతలు, ప్రభుత్వ పెద్దలు ప్రజానీకానికి సమాధానం ఇవ్వాల్సిందే. వీటి అమలుకు ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎంతో హుందాగా చెప్పారు. కానీ, కొత్త ప్రభుత్వం తీరు వేరుగా ఉన్నది. చేయాల్సిన పనులేంటో చెప్పకుండా పాత ప్రభుత్వం మీద ఉద్దేశపూరితంగా దాడి చేయడం సహేతుకం అనిపించుకోదు.



ఓ కాంగ్రెస్ నాయకుడు ఇంకో అడుగు ముందుకేసి పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందని వ్యాఖ్యానించారు. అసలు ఆయనకు బీఆర్ఎస్ పుట్టుక, ఎదుగుదల మీద కనీసం అవగాహన లేదనిపిస్తున్నది. కొంత రాజకీయ సంఖ్యా శాస్త్రపరంగా బీఆర్ఎస్ విజయాలను ఆయనకు తెలపాలనుకుంటున్నాను. ఎందుకంటే, నిజం చెప్పకపోతే అబద్ధం అరక్షణంలోనే ప్రపంచమంతా చుట్టి వస్తుందని ఒక నానుడి ఉన్నది. అందుకే ఈ ప్రస్తావన తేవాల్సి వచ్చింది.

> ఇటీవల రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి 37.35 శాతం, కాంగ్రెస్‌కు 39.40 శాతం ఓట్లు వచ్చిన విషయం సర్వత్రా తెలిసిందే. రెండు పార్టీల మధ్య కేవలం 2 శాతం ఓట్ల తేడా ఉన్నది. 2018లో జరిగిన ఎన్నికల్లో లభించిన ఓట్ల శాతం చూస్తే అప్పటి టీఆర్ఎస్‌కు 46.9 శాతం ఓట్లు వస్తే, కాంగ్రెస్‌కు 28.4 శాతం ఓట్లు వచ్చాయి.

రెండు పార్టీల మధ్య అప్పుడు 18 శాతం ఓట్ల తేడా ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తొలినాళ్లలో జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కేవలం 25.2 శాతం ఓట్లు రాగా టీఆర్ఎస్‌కు 34.3 శాతం లభించాయి. అంటే రెండు పార్టీల మధ్య తేడా 9 శాతానికిపైగా ఉన్నది. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో చూసుకున్నా గడిచిన రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కంటే 10 శాతం ఎక్కువ ఓట్లను బీఆర్ఎస్ దక్కించుకున్నది. ఇదిలా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 120 మున్సిపాలిటీల్లో 105 బీఆర్ఎస్ చేతిలోనే ఉన్నాయి. కాంగ్రెస్ కేవలం 5 మున్సిపాలిటీలను సొంతం చేసుకోగా.. బీజేపీ 4 మున్సిపాలిటీలలో ప్రభావం చూపగలిగింది. ఏఐఎంఐఎం భైంసాలో పాగా వేసింది. తొమ్మిది కార్పొరేషన్లకుగానూ ఆరు బీఆర్ఎస్ చేతిలోనే ఉన్నాయి. 2019లో జరిగిన జిల్లా పరిషత్తు ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరుగులేని విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 32 జిల్లాల్లోనూ విజయ ఢంకా మోగించి ఔరా అనిపించింది. అన్ని జిల్లాల జడ్పీ పీఠాలను గంపగుత్తగా కైవసం చేసుకున్నది. వీటిలో 20 జడ్పీ పీఠాలను మహిళలు దక్కించుకోవడం విశేషం. అన్ని జిల్లాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను అప్పటి అధికార పార్టీ టీఆర్ఎస్ సొంతం చేసుకున్నది. ఎంపీపీ ఎన్నికల్లో 80 శాతానికి పైగా పీఠాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్.. జడ్పీ ఎన్నికల్లో వంద శాతం స్థానాలను దక్కించుకున్నది. జడ్పీ చైర్మన్లలో 17 స్థానాలు వెనకబడిన సామాజిక వర్గాలకే దక్కాయి.

> 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 95 స్థానాల్లో పరాజయం పాలైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అదే ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 15 స్థానాలను కోల్పోయిన విషయం తెలిసిందే. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాల్లో ఆ పార్టీ ఓటమి చవిచూసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 14 స్థానాల్లో పరాజయం పాలైన విషయం తెలిసిందే.

2014 నుంచి 2023 వరకు ఏడు ఉప ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ ఒక్కదాంట్లో కూడా గెలవలేదు. పైగా మూడు ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య కేవలం 2 శాతం ఓట్ల తేడా ఉన్నది. ఈ మాత్రం వచ్చినందుకే కాంగ్రెస్ పార్టీ మిడిసిపడటం సహేతుకం కాదు. ఎమ్మెల్యేల పరంగా, స్థానిక సంస్థల పరంగా చూసుకున్నా.. ఎంతో బలంగా ఉన్న బీఆర్ఎస్ సార్వత్రిక ఎన్నికల తర్వాత కనుమరుగవుతుందని చెప్పడం హాస్యాస్పదంగా అనిపిస్తున్నది. చివరగా చెప్పేదేమిటంటే కాంగ్రెస్ పార్టీలో అధికార అహంకారం స్పష్టంగా కనిపిస్తున్నది. తెలంగాణ వాదం కోసం పుట్టిన బీఆర్ఎస్(టీఆర్ఎస్)ను తుద ముట్టించడం చంద్రబాబు, వైఎస్ఆర్‌ల వల్ల కాలేదు. ఈ నేతలు కొస్తున్న కోతలతో బీఆర్ఎస్ ఖతం అవుతుందని చెప్పడం పచ్చి అబద్ధం కాదా?

**వ్యాసకర్త : బీఆర్ఎస్ ఎంపీ**

## జాలి

ఈ మట్టిమీద నడుస్తున్న ప్రతి ప్రాణికి
సాటి ప్రాణిపై కాసింత ప్రేమ ఉండనే ఉంటుంది
ఉండాలె కూడా లేకపోతే ఈ నాగరిక సమాజం ఒప్పుకోదు.

దారిలో నడిచేటప్పుడు
చిక్కుముడులకు చిక్కుకున్న పక్షి రెక్కలను తప్పించి
దోసిలితో నీళ్ల దాపి అరచేతితో ప్రేమగా దువ్వే గుణం
ప్రతి బాటసారిలో ఉండాలె



మట్టిబాట మీద వలసెల్లి పోతుంటే
నల్లచీమల వరుసను కాలితో తొక్కకుండాతప్పించి
చీమల బారును చిదమకుండా కాపాడే దయ
కొన్ని మట్టి గుండెలకు కచ్చితంగా ఉంటుంది

వీధి అరుగు మీద ఏమీతోచక
విరగకాసిన మందారం చెట్టు వైపు చూస్తున్నప్పుడు
కాపుగాసి కుక్క పిల్లిని పట్టుకుపోతుంటే
తరిమికొట్టే జాలితనం మనిషితనం ఉండాల్సిందే

కట్టుకపోయిన సద్దిలో
సగం కడుపుకే తిని ప్రేమతో తోక ఊపుతూ
వెంట తిరిగే కుక్కపిల్లకు తన గిన్నెలో నుంచి
ఓ ముద్ద పెట్టే మనసు
ప్రతి కూలీతల్లిలో చందమామంత నిండుగా ఉండాలె

ఆకాశం నుంచి కన్నేసిన గద్ద
గుడిసె ముందటి కోడిపిల్లను నోటకర్చుకుపోతుంటే
గద్దించి అరిసి కోడిపిల్లను కాపాడే జాలి కచ్చితంగా ఉండాలి

నాలుగు బాటల కాడ కడుపుకాలి కండ్లెమ్మట నీళ్లు రాలుస్తూ
ఆకలవుతుందని అడిగే ముసలి ప్రాణానికి
కంచం నిండా బువ్వ పెట్టి కడుపునింపే గుండెలు
అక్కడక్కడ ఇంకా పదిలంగానే ఉంటాయి

జాలి మనుషులు ఉన్నారు
వాళ్లు ఉండబట్టే ఇంకా ఈ భూమ్మీద ప్రేమ మిగిలే ఉంది
ఆ ప్రేమనే మనిషిని మనిషిగా మాట్లాడేటట్టు
కలిసి ఉండేటట్టు చేస్తుంది!



**అవనిశ్రీ**
99854 19424

# ప్రజాస్వామ్యానికి చేటు పెగాసస్

ఇజ్రాయెల్‌కు చెందిన 'పెగాసస్' నిఘా సాఫ్ట్‌వేర్‌తో కేంద్ర ప్రభుత్వం హ్యాకింగ్‌కు పాల్పడిందన్న ఆరోపణలకు తాజాగా బలం చేకూరింది. ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకర్లతో దేశంలోని ప్రముఖుల ఐఫోన్లను లక్ష్యంగా చేసుకున్నారంటూ యాపిల్ సంస్థ నుంచి ముందస్తు అప్రమత్తతతో కూడిన హెచ్చరిక సందేశాలు అక్టోబర్‌లో వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇద్దరు భారతీయ జర్నలిస్టులు అనుమానించి తమ ఫోన్లను ల్యాబ్ పరీక్షలకు పంపగా, అవి 'పెగాసస్ స్పైవేర్' హ్యాకింగ్‌కు గురయ్యాయని అందులో తేలడం దిగ్భ్రాంతి కలిగించింది. తమ సెక్యూరిటీ ల్యాబ్ పరీక్షలో ఈ విషయం నిర్ధారణ అయిందని లాభాపేక్ష లేని అంతర్జాతీయ సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' ప్రకటించడం కలకలం రేపింది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
98493 28496




ఐఫోన్లకు పొరపాటున ముందస్తు హెచ్చరికలు వచ్చాయని యాపిల్ సంస్థ అప్పట్లో ఇచ్చిన వివరణ తప్పు అని ఈ ఘటనతో తేలిపోయింది. తమ నిఘా సాఫ్ట్‌వేర్‌ను కేవలం సార్వభౌమ దేశాల ప్రభుత్వాలకే విక్రయిస్తామని, వ్యక్తులకు, ప్రైవేట్ సంస్థలకు విక్రయించమని ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ సంస్థ స్పష్టంగా పేర్కొంది. భారత్‌కు చెందిన నిఘా విభాగం సైతం ఇదే సంస్థ నుంచి హార్డ్‌వేర్‌ను 2017లో కొనుగోలు చేసినట్టు మన దేశ వాణిజ్య గణాంకాల్లో వెల్లడైంది. ఈ నిఘా సాఫ్ట్‌వేర్ సాయంతో మన దేశంలోని ప్రముఖ విపక్ష సభ్యులు, అనుమానిత స్వపక్ష రాజకీయవేత్తలు, సామాజిక కార్యకర్తలు, న్యాయమూర్తులు, జర్నలిస్టుల ఫోన్లను హ్యాక్ చేస్తున్నట్టు సంచలన కథనాలు వెలువడ్డాయి. వారి వ్యక్తిగత సంభాషణలు, గోప్యంగా ఉండాల్సిన ఇతర సమాచారాన్ని అధికార వర్గాలు భారతీయ చట్టాలకు వ్యతిరేకంగా సేకరించాయని 2021 జూలైలో అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

> 'ది వైర్' వార్తా సంస్థ వెబ్‌సైట్ ఎడిటర్ సిద్ధార్థ్ వరదరాజన్, ఆర్గనైజ్డ్ క్రైమ్స్ అండ్ కరప్షన్ రిపోర్ట్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్‌పీ) దక్షిణాసియా ఎడిటర్ ఆనంద్ మంగ్నాలే ఫోన్లను హ్యాకర్లు లక్ష్యంగా చేసుకున్నారని 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' సంస్థ కథనాల ద్వారా తెలుస్తున్నది.

ఈ వివాదాన్ని కప్పిపుచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా భారత ప్రభుత్వమే యాపిల్ సంస్థపై ఒత్తిడి తీసుకువచ్చి తప్పుడు సందేశాలు ఇతర దేశాల్లోని యూజర్లకు కూడా వచ్చాయని చెప్పించిందని 'వాషింగ్టన్ పోస్ట్' పేర్కొంది. 'భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లోని ఐఫోన్ యూజర్లకు ఇలా పొరపాటున అలర్టులు వెళ్లాయి' అని యాపిల్ సంస్థ ఆనాడు చెప్పుకొచ్చింది. రాహుల్ గాంధీతో సహా పలువురు విపక్ష నేతలు, జడ్జీలు, సామాజిక కార్యకర్తల ఫోన్ల హ్యాకింగ్ ఉదంతం గతంలో పార్లమెంట్‌నూ కుదిపేసింది. ఇంత జరిగినా తాము స్పైవేర్‌ను కొనుగోలు చేయలేదు.. వినియోగించలేదు.. అని మోదీ ప్రభుత్వం ప్రకటించకపోవడం గమనార్హం. భారత రక్షణ నిఘా విభాగానికి చెందిన సిగ్నల్ ఇంటెలిజెంట్ డైరెక్టరేట్ గతంలో 'కాగ్నైసైట్' అనే సంస్థ నుంచి నిఘా పరికరాలు కొనుగోలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి.

ఏది ఏమైనా దేశ పౌరులు, విపక్ష నేతలు, న్యాయమూర్తులు, జర్నలిస్టుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించటం చట్టరీత్యా, నైతికంగా కూడా క్షమించరాని నేరం. ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు కేంద్ర ప్రభుత్వమే పూనుకోవటం సరైన పద్ధతి కాదు.

## ఎటమటం



### బస్సులో సగం

ఆకాశంలో సగం.. బస్సులో ఫుల్ అనే రోజులు వచ్చాయి. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత పురుష ప్రయాణికుల పాట్లు అన్నీఇన్నీ కావు. టికెట్ తీసుకొని ప్రయాణించే పురుషులేమో నిలబడి ప్రయాణం చేస్తుండగా, ఉచితంగా ప్రయాణించే మహిళలేమో దర్జాగా సీట్లో కూర్చొని వెళ్తున్నారు. బస్సులో 50-55 సీట్లకు మాత్రమే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ఈ లెక్కన ఉచితంగా ప్రయాణించే మహిళలకే బీమా వర్తిస్తుండగా, నిలబడి ప్రయాణించే పురుషులకు వర్తించదనే విషయం తాజాగా బయటపడింది. దీంతో 'ఇది మరీ అన్యాయం' అని పురుషులు లబోదిబోమనడంతో ఆర్టీసీ కూడా ఆలోచనలో పడినట్టు సమాచారం. 'ఆకాశంలో సగం' లెక్కన బస్సులో సగం సీట్లను పురుషులకు కేటాయించాలని ఆర్టీసీ యోచిస్తున్నట్టు వినికిడి. ఇదే జరిగితే ఇక నుంచి 'పురుషులను గౌరవిద్దాం.. వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం' అనే నినాదం బస్సుల్లో రాస్తారేమో చూడాలి.




### అదృశ్య శక్తులు ఎవరో?

కాంగ్రెస్‌లో వైఎస్ షర్మిల చేరిక విషయం ఎటూ తేలడం లేదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో షర్మిల చేరిక ఖాయమైందని గట్టి ప్రచారం జరిగింది. దీనికి బలం చేకూరుస్తూ ఆమె ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీ కూడా అయ్యారు. ఈ విషయం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీలో చేర్చుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది కానీ, ఆమెకు పార్టీ పగ్గాలు అప్పగించే విషయంలోనే కాంగ్రెస్ తర్జనభర్జన పడుతున్నట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. కాంగ్రెస్‌లో షర్మిల చేరికకు కొన్ని అదృశ్య శక్తులు అడ్డు పడుతున్నాయని సమాచారం. ఆ శక్తులు ఎవరనే దానిపై జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి.



### ఆ ఒక్కటీ అడక్కు

ఒకప్పుడు క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకొనే బీజేపీలో ఇప్పుడు అది లేకుండా పోయింది. రాష్ట్రానికి జాతీయ నాయకులు ఎవరు వచ్చినా.. మీలో మీరు కొట్లాడుకోవద్దు.. అని చెప్పి వెళ్తున్నారు. 'మీలో మీకు ఏవైనా గొడవలుంటే మా దృష్టికి (అధిష్ఠానం) తీసుకురండి, అంతే కానీ, ఒకరిపై ఒకరు సోషల్ మీడియాలో దుమ్మెత్తి పోసుకోవడమేంటి? అసహ్యంగా' అని మొన్న రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్, నిన్న అమిత్ షా కాస్త గట్టిగానే తలంటినట్టు సమాచారం. 'పార్టీలో గొడవలు లేకుండా ఉండి ఉంటే రాష్ట్రంలో మనం అధికారంలో ఉండే వాళ్లం' అని అమిత్ షా వాపోయారట. అది సరే కానీ, పార్టీని బలహీనపరిచిందెవరు? తప్పు మీ వద్ద పెట్టుకొని.. మాకు సుద్దులు చెప్తే ఎలా? అని కొందరు నేతలు సణిగితే, 'ఆ ఒక్కటి అడగొద్దు' అన్నట్టు ఉంది వారి వ్యవహారమని సీనియర్ నేత ఒకరు వాపోయారు.



### జోరుమీదున్న సీపీఐ

కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని ఒకే ఒక్క సీటుతో సరిపెట్టుకున్న సీపీఐ ఎట్టకేలకు అసెంబ్లీలో అడుగు పెట్టింది. తాజాగా సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల్లోనూ గుర్తింపు సంఘంగా విజయం సాధించింది. పొత్తు ఒప్పందంలో భాగంగా మరో రెండు ఎమ్మెల్సీలను కూడా ఆ పార్టీ దక్కించుకోనున్నది. అంతటితో ఆ పార్టీ తృప్తి చెందడం లేదు. ఎన్నికలకు ముందు తమకు ఒక మంత్రి పదవి కూడా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని సీపీఐ నేతలు గుర్తు చేస్తున్నారు. పాపం, అసెంబ్లీ ఎన్నికలలో బాగా నష్టపోయిన పార్టీ ఏదైనా ఉందా? అంటే ఒకటి సీపీఎం, రెండోది పవన్‌కల్యాణ్ జనసేన మాత్రమే. ఈ రెండు పార్టీలూ డిపాజిట్లు కోల్పోవడమే కాకుండా బర్రెలక్క కంటే తక్కువ ఓట్లు రావడంతో తలెత్తుకోలేకపోతున్నాయి.

**- వెల్జాల**

## మతానికి ప్రాధాన్యమివ్వడం బాధాకరం

మనం మతానికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. అది నన్నెంతో బాధిస్తున్నది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడాన్ని కండ్లారా చూస్తున్నాం. మనం తప్పుడు మార్గంలో పయనిస్తున్నాం. దేశమంతా రామ మందిరం, రామ జన్మభూమి చుట్టూ తిరగడం నన్నెంతో కలచివేస్తున్నది. దేశంలో ఎక్కడ మంచి జరిగినా, అది ప్రధాని మోదీ వల్లనే జరిగిందని అందరూ భావిస్తుండటం ఇంకా బాధిస్తున్నది.



**- శామ్ పిట్రోడా,** కాంగ్రెస్ సీనియర్ నేత

## భారతీయతకు వారెప్పుడో తిలోదకాలిచ్చారు!



రాముడు ఊహాజనిత పాత్ర మాత్రమేనని భావించే కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా లాంటి వాళ్లు ఈ దేశం నుంచి ఎప్పుడో వేరయ్యారు. భారతీయత, భారతీయ విలువలకు వారెప్పుడో తిలోదకాలిచ్చారు. అలాంటి వారు ఒకవేళ భారతీయతతో మమేకమై ఉంటే రామాయణం మనకు ఏం నేర్పిందో తెలుసుకునేవారు. రామరాజ్యం భావనను అర్థం చేసుకునేవారు.

**- మీనాక్షి లేఖి,** కేంద్రమంత్రి